క్లుప్తంగా

దాసాంజనేయ స్వామికి విశేష పూజలు

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణంలోని శ్రీమారుతి టాకీస్ సెంటర్‌లోని శ్రీదాసాంజనేయ స్వామివారి దేవస్థానంలో 44వ శ్రీహనుమద్ వ్రత వార్షిక మహోత్సవాలలో భాగంగా లక్ష తమలపాకులతో ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయ ఈవో గొట్టుముక్కల నాగ సీతారామరాజు పర్యవేక్షణలో ఆలయ అర్చకులు ఘంటసాల పవన్ కుమార్‌శర్మ స్వామివారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

రామ భక్తాంజనేయుని వార్షిక మహోత్సవం



ప్రత్యేక అలంకరణలో రామ భక్తాంజనేయస్వామి

వీరవాసరం: మండలంలోని నందమూరి గరువులో శ్రీ రామ భక్తాంజనేయ స్వామి 59వ వార్షిక మహోత్సవాల సందర్భంగా శనివారం స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి పూజ గంధసింధూరంతో తమలపాకులతో స్వామివారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. సినీ ఆర్కెస్ట్రా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో మేకల వెంకట చలపతి, ముద్రగల్ల యేసు రాజు, కొప్పినీడి శ్రీనివాసరావు, కావలి రుషి కేసు దామోదర్ రావు, కొప్పినీడి శ్యామలరావు, అప్పారావు, వడ్డీ కనదుర్గ ప్రసాద్, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అంధత్వ నిర్మూలనే లయన్స్ లక్ష్యం

ఆకివీడు: అంధత్వ నిర్మూలనే లయన్స్ లక్ష్యమని ఆదర్శ లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కాకర్ల రాజరాజేశ్వరి, మోరా జ్యోతిరెడ్డి చెప్పారు. స్థానిక ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రిలో కంటి ఆపరేషన్ చేయించుకున్న పేదలకు లయన్స్ ఆదర్శ క్లబ్ కళ్లజోళ్లు, దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉచిత కంటి వైద్య శిబిరాల ద్వారా లయన్స్ పలువురికి కంటి చూపు కల్పించిందన్నారు. కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధులు ఉద్దరాజు శ్రీనివాసరాజు, ఎండీ.అహ్మద్, ఎస్‌కే.ఎం.షరీఫ్ పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళాలు

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణంలోని మావుళ్లమ్మ అమ్మవారి సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి శనివారం బెంగుళూరుకి చెందిన బి వెంకట నరసింహమూర్తి రూ.50 వేలు, ఎస్.కామేశ్వర సుహాస్ రూ.50వేలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా వారిచే ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మ శ్రీ మద్దిరాల మల్లికార్జున శర్మ పూజలు నిర్వహించారు. దాతలకు ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మీ నగేష్ అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



క్రీస్తు సందేశాన్ని అందజేస్తున్న పాస్టర్ వి.రమేష్‌బాబు, ప్రసంగీకులు మాథ్యూస్

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం చినరంగనిపాలెంలోని బేతెస్థ మినిస్ట్రీస్ 20 వార్షిక క్రిస్మస్ వేడుకలు శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో క్రిస్మస్ గీతాలు, సంగీతం, క్యాండిల్ లైట్, క్రిస్మస్ పాటలకు చిన్నారుల చేసిన నృత్యాలు విశ్వాసులను అకట్టుకున్నాయి. పాస్టర్ వి. రమేష్‌బాబు, పాస్టర్ మాథ్యూస్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి క్రీస్తు సందేశాన్ని అందజేశారు. ప్రపంచ శాంతి కోసం ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పాస్టర్లు, పెద్ద సంఖ్యలో విశ్వాసులు, యువత, చిన్నారులు పాల్గొన్నారు.

సర్దుబాటు పేరుతో విద్యుత్ చార్జీల భారం



స్థానిక 13వ వార్డులో విద్యుత్ చార్జీలపై నిరసన వ్యక్తంచేస్తున్న సీపీఎం నాయకులు

ఆకివీడు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విద్యుత్ చార్జీల సర్దుబాటు పేరుతో ప్రజల్ని ఇబ్బందులకు గురిచేస్తోందని సీపీఎం నాయకులు పెంకి అప్పారావు ఆరోపించారు. స్థానిక 14,16 వార్డుల్లో పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, రీచార్జింగ్ విధానంతో వినియోగదారులకు మరింత భారం ఏర్పడనుందన్నారు. పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణం తగ్గించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. డోకల రవితేజ, షేక్ వలీ, అమ్మాజీ, దొడ్డి పద్మ, శ్రీను పాల్గొన్నారు.

బీమా ప్రీమియం.. రైతులకు భారం

- పంటల బీమా ప్రీమియంను క్రమం తప్పకుండా చెల్లించిన గత ప్రభుత్వం
- రైతులే చెల్లించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం
- చంద్రబాబు తీరుపై అన్నదాతల ఆగ్రహం



వరి నాట్లు వేస్తున్న కూలీలు (ఫైల్)



విస్సాకోడేరులో దాళ్వా సాగుకు నారుమడిని సిద్ధం చేసిన దృశ్యం

పాలకోడేరు: కూటమి ప్రభుత్వం రైతు నెత్తిన బీమా భారం మోపింది. ప్రస్తుతం రబీ సీజన్‌లో సాగు చేసుకుంటున్న ప్రీమియం మొత్తం రైతులే చెల్లించాలని ప్రభుత్వం ఆదేశించడంపై వారంతా మండిపడుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2023 రబీ సీజన్‌లో రైతుల తరఫున పంటల బీమా ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లించింది. కూటమి ప్రభుత్వం బీమా ప్రీమియంను రైతులే చెల్లించాలని ఆదేశాలు జారీ చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. సుఖీభవ పథకం ద్వారా ఏటా రూ.20 వేలు రైతులకు జమ చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం ఆ హామీని విస్మరించి బీమా ప్రీమియం చెల్లించాలని చెప్పడం సరికాదని రైతులు అంటున్నారు.

రైతుల అవస్థలను పట్టించుకోని ప్రభుత్వం

టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అన్నదాతలకు అవస్థలు పెరిగాయి. అవేమీ పట్టించుకోకుండా బీమా ప్రీమియం మొత్తాన్ని ఈ నెల 30వ తేదీ లోగా చెల్లించాలని ప్రభుత్వం గడువు ప్రకటించడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. పెట్టుబడికి డబ్బులు లేక అప్పు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొందని, దీనికి తోడు బీమా ప్రీమియం పేరుతో రైతులను వేధించడం సరికాదని వారంటున్నారు.

11వేల మంది బాధిత రైతులు

ఉండి నియోజకవర్గంలోని పాలకోడేరు, ఆకివీడు, కాళ్ల, ఉండి మండలాల్లో 11,527 మంది రైతులు ఉండగా వీరికి 27,951 ఎకరాల సాగు భూమి ఉంది. వీరందరికీ గత ప్రభుత్వ బీమాతో పాటు రైతులకు పెట్టుబడి సాగు కింద రూ.3కోట్ల నిధులు చెల్లించేది. గత ప్రభుత్వం మాదిరిగానే కూటమి ప్రభుత్వం కూడా అన్నదాత సుఖీభవ నిధులను రైతు ఖాతాలకు జమ చేస్తుందని ఆశించిన రైతులకు నిరాశ మిగిలింది. కనీసం రబీ సీజన్‌లో నైనా పథకాన్ని అమలు చేస్తారనుకుంటే ఆ ఊసే లేకుండా పోయింది. దీంతో ఖరీఫ్ పంటల సాగుకు అన్నదాతలు అప్పులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

అప్పుల సాగు

ఉండి నియోజకవర్గంలోని పాలకోడేరు, ఆకివీడు ఉండి, కాళ్ల మండలాల్లో ఈ రబీ సీజన్‌లో వరితో పాటు వివిధ పంటలు సాగు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంత వరకు అన్నదాత సుఖీభవ పథకంలో రూపాయి కూడా అందించకపోవడంతో రైతులు బయట అధిక వడ్డీలకు రుణాలు తీసుకొని అప్పుల పాలవుతున్నారు. మరి కొంతమంది సాగుకు డబ్బులు లేక భూములను బీడుగా వదిలి పెట్టడానికి సిద్ధమయ్యారు.

ప్రీమియం భారం రూ.2 కోట్లు

ప్రీమియం భారం గత ప్రభుత్వంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతుల తరుపున ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లించింది. దీంతో పాటు పంట సాగు చేసే ప్రతి రైతుకు పట్టుబడి సాయం కింద ఏటా రూ.15 వేల నగదును రైతు ఖాతాకు క్రమం తప్పకుండా జమ చేసింది. దీంతో ఖరీఫ్, రబీ సాగుకు అవసరమైన ఆర్థిక సాయం అందడంతో అధిక వడ్డీలకు అప్పు చేయకుండా రైతులు సంతోషంగా పంట సాగు చేసుకునేవారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువు తీరిన తరువాత పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. ప్రభుత్వం ఏర్పడి 6 నెలలైనా గత ప్రభుత్వ బీమాతో పాటు రైతులకు ఎలాంటి సాయం అందించకపోగా బీమా ప్రీమియం సాగుదారులే చెల్లించడం ఏమిటని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలోని రైతు వరి పంట ఎకరాకు రూ. 650 కట్టాలని ప్రభుత్వం ఆదేశించినట్లు అధికారులు తెలిపారు.

అన్నదాతలను ఆదుకోవాలి



రబీ సీజన్‌కు సంబంధించి పంటల బీమా ప్రీమియంను గత ప్రభుత్వం మాదిరిగానే కూటమి ప్రభుత్వం చెల్లించాలి. ఆ దిశగా పాలకులు చర్యలు తీసుకోవాలి. అన్నదాతలను ఆదుకోవడమే లక్ష్యంగా ప్రభుత్వాలు పని చేయాలి. –గుండు నాగేశ్వరరావు, రైతు, కోరుకొల్లు

రైతులను అప్పులపాలు కాకుండా కాపాడాలి



అన్నదాత సుఖీభవ నిధులను వెంటనే రైతుల ఖాతాలకు జమ చేయాలి. ప్రభుత్వం రైతుల కోసం ప్రకటించిన అన్నదాత సుఖీభవ నిధులను రైతుల ఖాతాలకు జమ చేయాలి. చాలామంది రైతులు ఈ నిధులు వస్తాయని సాగు పెట్టుబడి కోసం అప్పులు చేసుకున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించాలి. – గుంటుపల్లి వెంకన్న, రైతు, గరగపర్రు

విష్ణు కళాశాలలో ముగిసిన వర్క్‌షాప్

భీమవరం: పట్టణంలోని శ్రీ విష్ణు ఇంజనీరింగ్ కళాశాలలో వారం రోజులుపాటు నిర్వహించిన ఇండస్ట్రీ అకాడమియా ప్రాక్టీసెస్ ఇన్ సివిల్ ఇంజనీరింగ్ వర్క్‌షాప్ శనివారం ముగిసింది. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ మంగం వేణు మాట్లాడుతూ ఇలాంటి వర్క్‌షాప్ కార్యక్రమాలు విద్యార్థులకు పరిశ్రమ అవసరాలను అర్థం చేసుకోవడానికి, తమ నైపుణ్యాలను మెరుగుపరచుకోవడానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. వైస్ ప్రిన్సిపల్ శ్రీలక్ష్మి మాట్లాడుతూ వర్క్‌షాప్ ద్వారా విద్యార్థుల భవిష్యత్ అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ డిపార్ట్‌మెంట్ హెడ్ కె విజయ్, అంజని టెక్, సాగర్ సిమెంట్స్, వీరా కాంక్రీట్, అల్ట్రాటెక్, యూకాన్, పాసిబిల్ట్, జిందాల్ పంతర్, పద్మప్రియ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, గాయత్రి అసోసియేట్స్, స్ట్రెజ్నా వంటి సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

బాలా త్రిపురసుందరి మాతకు విశేష పూజలు

భీమవరం (ప్రకాశంచౌక్): పౌర్ణమి సందర్భంగా భీమవరం మెంటేవారి తోటలోని విజయ కనకదుర్గ సహిత బాలా త్రిపుర సుందరి అమ్మవారికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయ ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన తామరాడ శివాజీ, శ్రీనిధి దంపతులతో అర్చకులు విశేష అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

అల్లు అర్జున్ అరెస్టులో రాజకీయ కుట్ర

భీమవరం(ప్రకాశం చౌక్): సినీ హీరో అల్లు అర్జున్ అరెస్టులో రాజకీయ కుట్ర కోణం దాగి ఉందని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు కోడే యుగంధర్ ఆరోపించారు. అల్లు అర్జున్ అరెస్టుపై శనివారం కోడే యుగంధర్ మాట్లాడుతూ సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనకు సంబంధించి ఆ థియేటర్ నిర్వాహకులను, జనాన్ని అదుపు చేయని పోలీసులను ఈ సంఘటనలో ఎందుకు బాధ్యులని చేయలేదని ప్రశ్నించారు. రాజమహేంద్రవరం పుష్కరాల్లో 29మంది మృతికి దారితీసిన తొక్కిసలాటకు బాధ్యుడైన అప్పటి సీఎం చంద్రబాబును అరెస్టు చేయాల్సి ఉంటుందని చెప్పారు. చంద్రబాబుకు ఒక రకంగా, అల్లు అర్జున్‌కు మరో రకంగా చట్టం ఉండకూడదన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

భీమవరం: పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో జిల్లా బుద్ధిష్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా కమిటీ సమావేశంలో నూతన కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా వై హరిబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడి కే కే బోదీ, రాష్ట్ర కో ఆర్డినేటర్ సుబ్రహ్మణ్యం అధ్యక్షతన రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కోనా జోషప్, జిల్లా అధ్యక్షుడిగా ఈది రవి కుమార్, వైస్ ప్రెసిడెంట్ పిట్ట సాయికృష్ణ, గూడాల నాగేశ్వరరావు, జనరల్ సెక్రెటరీ కొల్లి శ్రీనివాస్, సెక్రటరీగా గాతల సందీప్‌ను ఎన్నుకున్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు జోషప్, జిల్లా అధ్యక్షుడు రవి కుమార్ పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 31 కేసుల రాజీ

ఉండి: భీమవరం సెంకండ్ అడిషినల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు(ఏజేఎఫ్ఎంసీ)లో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ ద్వారా 31 కేసులు రాజీ అయినట్లు ఎస్సై ఎండీ నసీరుల్లా తెలిపారు. ఎస్సై, సిబ్బంది ఆధ్వర్యంలో కేసులు పరిష్కరించినట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తిపై దాడి కేసు నమోదు

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం వ్యక్తిపై మరో వ్యక్తి తాగిన మైకంలో దాడి చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం ఈలంపూడి గ్రామానికి చెందిన ద్రోనాద్రి యువతేజ ఈ నెల 12న రాత్రి ఖాళీ స్థలంలో ఉండగా జూటూరి వెంకన్న ఫుల్‌గా మద్యం సేవించి ద్రోనాద్రి యువతేజతో తన ఇంటివద్ద ద్విచక్రవాహనంపై దింపమన్నాడు. నేను దింపను నువ్వు మద్యం సేవించి ఉన్నావు అని ద్రోనాద్రి యువతేజ చెప్పడంతో కోపంతో జూటూరి వెంకన్న ద్రోనాద్రి యువతేజను నోటితో కరిచి కర్రతో కట్టినట్లు బాధితుడు యువతేజ ఫిర్యాదు మేరకు రూరల్ హెడ్‌కానిస్టేబుల్ పి. మహేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రశాంతంగా నీటి సంఘాల ఎన్నికలు



సీసలిలో ఎన్నికల అధికారులకు సూచనలు ఇస్తున్న జేసీ టి.రాహుల్‌కుమార్ రెడ్డి

పాలకోడేరు: పాలకోడేరు మండలంలో నీటి సంఘాల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగాయని మండల తహసీల్దార్ ఎస్.భారతి విజయలక్ష్మి తెలిపారు. ఈ ఎన్నికలన్నీ ఏకగ్రీవమయ్యాయని తెలిపారు. పాలకోడేరు, మోగల్లు, శృంగవృక్షం నీటి సంఘాలకు అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, మెంబర్లను ఎన్నుకున్నారు.

టీడీపీకి ఐదు, జనసేన, బీజేపీకి ఒకటి

ఆకివీడు: మండలంలోని ఆరు నీటి సంఘాల ఎన్నికలు పూర్తయ్యాయి. టీడీపీకి ఐదు నీటి సంఘాలు కేటాయించుకోగా, ఒకటి జనసేన, బీజేపీకి, కేటాయించారు. కుప్పనపూడి నీటి సంఘం ఎన్నిక ఏకగ్రీవమైంది. ఆకివీడు, కోళ్లపర్రు, పెదకాపవరం, సిద్ధాపురం, అయిభీమవరం నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు.

కాళ్లలో 10 నీటి సంఘాలు ఏకగ్రీవం

కాళ్ల: సాగునీటి సంఘాల ఎన్నికలు కాళ్ల మండలంలో ప్రశాంత వాతావరణంలో నిర్వహించారు. కాళ్ల మండల పరిధిలోని పది నీటి సంఘాలకు ఆయా గ్రామాల్లో శనివారం నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్ష, ఉపాధ్యక్షులతోపాటు డైరెక్టర్లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు తెలిపారు. మండలంలో మొత్తం 120 మంది డైరెక్టర్లకు 113 టీసీలకు నామినేషన్లు అభ్యర్థులు వేశారని తెలిపారు. పెదఅమీరంలో 1, సీసలిలో 1, కోపల్లెలో 1, బొండాడలో 2, కలవపూడిలో 2 టీసీలకు అభ్యర్థులు ఎవరూ నామినేషన్లు వేసేందుకు ముందుకు రాకపోవడంతో ఆయా టీసీలకు ఎన్నికలు నిర్వహించలేదని అధికారులు తెలిపారు. సాగునీటి సంఘాలకు ఎన్నికైన సభ్యులను పలువురు నాయకులు, రైతులు అభినందించారు. శనివారం కాళ్ల మండలంలోని సీసలిలో జిల్లా పరిషత్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన సాగునీటి సంఘాల ఎన్నికల కేంద్రాన్ని జేసీ టి.రాహుల్‌కుమార్ రెడ్డి పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. తహసీల్దార్ జి.సుందర్‌సింగ్, ఇరిగేషన్ డీఈ పీఎల్‌వీవీ సత్యనారాయణమూర్తి, ఆర్ఐ కె.లక్ష్మీకిరణ్ ఉన్నారు.

8 సాగునీటి సంఘాలకు ఎన్నికలు

భీమవరం అర్బన్: మండలంలో చినఅమిరం, తాడేరు, తుందుర్రు, దిరుసుమర్రు, వెంప, అనాకోడేరు, గొల్లవానితిప్ప, ఎల్‌జీపాడులో శనివారం పాఠశాలల్లో నిర్వహించిన సాగునీటి సంఘాల ఎన్నికలలో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల సమక్షంలో అధ్యక్ష, ఉపాధ్యక్ష, సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 8 సాగునీటి సంఘాలు అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, మెంబర్లను ఎన్ను కున్నారు.

సాగునీటి సంఘాల ఎన్నిక ఏకగ్రీవం

వీరవాసరం: మండలంలోని ఐదు సాగునీటి సంఘాలకు ఎన్నికలు ఏకగ్రీవం అయినట్లు తహసీల్దార్ ఏవీ రామాంజనేయులు శనివారం తెలిపారు. వీరవాసరం, తోలేరు, రాయకుదురు, మత్స్యపురి సాగునీటి సంఘ అధ్యక్షులను, మెంబర్లను ఎన్నుకున్నారు.

రాజీమార్గంలోనే కేసుల సత్వర పరిష్కారం



భీమవరంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం: కేసుల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్ చక్కని మార్గమని భీమవరం మండల న్యాయ సేవా సంస్థ చైర్మన్, 3వ అదనపు జిల్లా జడ్జి ఎం.ఏ సోమశేఖర్ తెలిపారు. భీమవరం కోర్టు ప్రాంగణంలో సివిల్, క్రిమినల్ కేసుల పరిష్కారం నిమిత్తం శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల రాజీకి 4 బెంచ్‌లు ఏర్పాటు చేశారు. ప్రిసైడింగ్ న్యాయమూర్తులు గా సోమశేఖర్ తో పాటు ఫోక్సో కోర్టు న్యాయమూర్తి బి.లక్ష్మీ నారాయణ, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) ఎ. సురేష్ బాబు, 2వ అదనపు జుడీషియల్ మొదటి తరగతి మేజిస్ట్రేట్ ఈ. ధనరాజు వ్యవహరించారు. జాతీయ లోక్ అదాలత్‌లో 17 సివిల్ కేసులు, 233 క్రిమినల్ కేసులు, 96 ఎక్సైజ్ కేసులు, బ్యాంకు బీఎస్ఎన్ఎల్ మొండి బాకీ కేసులు 10, బెంచ్ కోర్టు కేసులు 252 మొత్తం 608 కేసులు రాజీ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కె.గోపాలకృష్ణం రాజు, టి.గంగరాజు, పి.జయకుమార్, వి.కరుణాకరరావు పాల్గొన్నారు.

విస్సాకోడేరు గ్రామ ప్రతిష్టను దిగజారిస్తే ఊరుకోం



విస్సాకోడేరులో నిరసన తెలుపుతున్న పంచాయతీ పాలకవర్గం, గ్రామస్తులు

పాలకోడేరు: ప్రశాంతతకు మారు పేరైన విస్సాకోడేరు గ్రామ ప్రతిష్టతను దిగజారిస్తే సహించేది లేదని మూకుమ్మడిగా ఆ గ్రామ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే నిడమర్రుకు చెందిన సంకెళ్ల రాంబాబు సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు సేకరించానంటూ సర్పంచ్ బొల్లా శ్రీనివాస్‌పై చేస్తున్న ఆరోపణలు అవాస్తమని విస్సాకోడేరు గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక శివాలయం వద్ద ఏర్పాటుచేసిన గ్రామ సభలో రెండు నెలల నుంచి సంకెళ్ల రాంబాబు చేస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు గాదం నానాజీ, డాక్టర్ పి స్వర్ణలత, బొల్లం వెంకటేశ్వరరావు, కుసుమే ప్రసాదు, సురేష్ మాట్లాడుతూ సర్పంచ్ బొల్లా శ్రీనివాస్ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించడంతోపాటు గ్రామాన్ని ఎంతో అభివృద్ధి చేశారని అన్నారు. అలాంటి వ్యక్తిపై అవినీతి ఆరోపణ చేస్తున్న రాంబాబుపై చర్యలు తీసుకోవాలని ఇప్పటికే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసామన్నారు. అవినీతి ఆరోపణలపై బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. సర్పంచ్ బొల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ తప్పుడు ఆరోపణలు చేస్తున్న రాంబాబుపై న్యాయ పోరాటానికి సిద్ధమని హెచ్చరించారు. గ్రామసభలో గొరగనమూడి, వేండ్ర, పాలకోడేరు సర్పంచులు గొట్టుముక్కల వెంకట శివరామరాజు, ఇంజేటి మరియమ్మ, కడలి నాగేశ్వరి, మాజీ సర్పంచ్ చెల్లబోయిన పాపారావు, ఉప సర్పంచ్ కందుల నాగరాజు, ఎంపీటీసీలు బొల్లం గాంధీ, లక్ష్మీపతి, వార్డ్ మెంబర్లు సత్యనారాయణ, బాలాజీ, చంద్రబాబు, చందు, ఏడుకొండలు పాల్గొన్నారు.

ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ గెలుపుపై హర్షం



అనసూయ చెస్ అకాడమీలో కేక్‌కట్ చేస్తున్న దృశ్యం

భీమవరం: సింగపూర్‌లో జరిగిన ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన దొమ్మరాజు గుకేశ్ విజయం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భీమవరం, అనసూయ చెస్ అకాడమీలో శనివారం సంబరాలు నిర్వహించారు. ఈసందర్భంగా గుకేశ్ విజయోత్సవ కేక్‌ను ఇంటర్నేషనల్ చెస్ గ్రాండ్ మాస్టర్ పీడీఎస్ గిరినాథ్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 18 ఏళ్ల వయసులోనే గుకేశ్ చదరంగం రారాజుగా నిలవడం అభినందనీయమన్నారు. అతని విజయం దేశానికే గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు మాదాసు కిషోర్, కో–ఆర్డినేటర్ అల్లు శ్రీనివాస్, జిల్లా చెస్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి మైలాపురి మురళి, కేసీ సురేష్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

భీమవరం(ప్రకాశం చౌక్): పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని భీమవరం సంఘ మిత్ర గ్యాస్ ఏజెన్సీ అధినేత పెన్మెత్స సత్తిబాబు అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో జాతీయ ఇంధన పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు. సత్తిబాబు మాట్లాడుతూ ఇంధనాలు అమూల్యమైనవని, వాటిని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని తెలిపారు. వాతావరణ కాలుష్యం పెరగడం ఇంధనాలను ఖర్చు పెట్టడం వల్ల మొక్కలు, జంతువులు, ఇతర సహజ వనరులన్నీ దెబ్బతింటాయని పేర్కొన్నారు. డీఎన్నార్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ చెల్లబోయిన రంగారావు, జనసేన రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి ఉండపల్లి రమేష్ నాయుడు, చెరుకువాడ రంగసాయి, పి అమూల్యరావు మాట్లాడుతూ చెట్లు, జంతువులే లేకపోతే మానవ మనుగడే ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు.

కేజీహెచ్ న్యూరో సర్జన్ విభాగానికి సుంకర పేరు



భీమవరంలో బాలపరమేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

భీమవరం: పట్టణానికి చెందిన న్యూరో సర్జన్‌గా పేరొందిన దివంగత డాక్టర్ సుంకర బాల పరమేశ్వరరావు పేరును విశాఖపట్నంలోని కేజీహెచ్ హాస్పిటల్‌లోని న్యూరో సర్జన్ విభాగానికి ప్రతిపాదిస్తూ జీవో జారీ చేయడం పట్ల భీమవరం, సిటిజన్ ఫోరం సేవా సంస్థ హర్షం వ్యక్తం చేసింది. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొండా వెంకటేశ్వరరావు, కె.కరుణాకరరావులు మాట్లాడుతూ వైద్య రంగంలో విశిష్ట పరిశోధనలు చేసి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటి న్యూరో సర్జన్ విభాగాన్ని ప్రవేశపెట్టిన ప్రముఖ వైద్యునిగా పేరొందారన్నారు. ముందుగా బాలపరమేశ్వరరావు చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పాలకోడేరు: విస్సాకోడేరులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటార్‌సైకిల్‌పై వెళుతున్న ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే వీరవల్లి ఉమా శంకర్ తన స్నేహితుడితో కలిసి మోటార్‌సైకిల్‌పై చినరంగడిపాలెం నుంచి గొరగనమూడి వెళ్తుండగా హఠాత్తుగా ఎదురుగా మరో వాహనచోదకుడు అడ్డురావడంతో అదుపుతప్పి విస్సాకోదరులోని సాయిబాబా గుడి వద్ద రోడ్డుపై పడిపోయారు. ఈ ప్రమాదంలో వీరవల్లి ఉమా శంకర్‌తోపాటు అతని స్నేహితుడికి తీవ్ర గాయాలయ్యాయి. వీరవల్లి ఉపేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్ హరిబాబు తెలిపారు.బాధితులు ఇద్దరూ భీమవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

వంద రోజుల యాక్షన్ ప్లాన్‌పై ఏపీటీఎఫ్ అభ్యంతరం

భీమవరం: పదో తరగతి పబ్లిక్ పరీక్షల కోసం, విద్యాశాఖ వందరోజుల యాక్షన్ ప్లాన్ విడుదల చేసి ఆదివారాలు, పండగ సెలవుల్లో కూడా తరగతులు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేయడం పట్ల ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి ప్రకాశం, బి వి నారాయణ శనివారం ప్రకటనలో తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దశాబ్ద కాలంగా ఉదయం, సాయంత్రం పదో తరగతి విద్యార్థులకు స్టడీ అవర్స్ నిర్వహించడం ఎప్పటినుంచో స్వచ్ఛందంగా జరుగుతోందని, ఈ ఏడాది ప్రత్యేకంగా వందరోజుల యాక్షన్ ప్లాన్ ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. వారంలో ఒక్క రోజు అయినా విద్యార్థులకు విశ్రాంతి ఇవ్వకపోవడం వారిని మానసికంగా ఒత్తిడికి గురి చేయడం సరికాదని ఆందోళన వ్యక్తం చేశారు.

నేడు దత్తాత్రేయునికి తెప్పోత్సవం

ఉండి: ఉండిలో లక్ష్మీగణపతి దత్తసాయి ఆలయంలోని గురు తత్తాత్రేయస్వామికి 15వ తేదీ ఆదివారం సాయంత్రం 6.45 గంటలకు తెప్పోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు బ్రహ్మశ్రీ సన్నిధిరాజు చలపతి రావు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 7 గంటల నుంచి 12 గంటల వరకు ఆలయం వద్ద దత్తాత్రేయునికి విశేష పూజలు నిర్వహించి ప్రసాద వితరణ చేస్తామన్నారు. ఆలయం వద్ద ప్రతి గురువారం అన్నసమారాధన నిర్వహిస్తున్నామని దానికి రూ.30 వేలు ఖర్చు అవుతుందని, రూ.15 వేలు ఇచ్చిన భక్తుల పేరున అన్నసమారాధన నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.ఆసక్తి గల భక్తులు 2025 జనవరి, 2026 జనవరి వరకు తమ పేర్లు నమోదు చేయించుకోవాలని ఆయన కోరారు.